# సర్పశాంతి

'మిర్రర్'

సాయంకాలం అయిదున్నర అయింది.

ఆఫీసునుంచి ఇంటిముఖంగా వెళుతున్నాను. ఆబిడ్సు చేరుకునేసరికి కార్డులు, కవర్లు కొనవలసిన అవుసరం గుర్తువచ్చి జి.పి.వో.లో జొరబడ్డాను.

కౌంటరులో వున్న క్లర్కుతో నాకు కావలసిన వాటి వివరాలు చెబుతుండగా గబగబా వో యువకుడు వచ్చి అంతకంటె తొందరగా ఇరవై అయిదు పైసల స్టాంపు కావాలంటూ హడావిడి పెట్టాడు.

అతని తొందరపాటుకు నాతోపాటు కౌంటరులో క్లర్కుకూడా ఆశ్చర్యపోయాడు.

ఆ యువకుడు తన చేతిలో వున్న కవరు కౌంటరుమీద వుంచి జేబులోంచి పర్సుతీసి ఇరవై అయిదు పైసల నాణెం అందించాడు.

యధాలాపంగా ఆ కవరువైపు చూసిన నేను నిలుచున్న చోటినే కొయ్యబారిపోయాను. ఆ కవరుమీద నా భార్య పేరుతోపాటు మా ఇంటి అడ్రసు వ్రాసి వుంది.

నా భార్య సునందకు లెటరు వ్రాస్తున్న ఆ యువకుడిని గతంలో నేనెన్నడూ చూడలేదు. అతనికి ఇరవై ఎనిమిది సంవత్సరాల వయసుంటుంది. మనిషి మహా స్మార్ట్‌గా వున్నాడు.

నేను తేరుకునే లోపల ఆ వ్యక్తి కవరుమీద స్టాంపు అంటించి ప్రక్కనేవున్న లెటరుబాక్సులోకి కవరు జారవిడిచి గబగబా బయటకు నడిచాడు.

అయోమయంగా అతన్ని వెంబడిస్తూ బయటకు వచ్చాను. చూస్తూ చూస్తూ వుండగానే అతను ఎదురుగా ఆగివున్న డబుల్‌డెక్కర్ బస్సు ఎక్కటం అది కదిలి వెళ్ళటం జరిగిపోయింది.

ఆ యువకుడు ఎవరు? అతనికి సునందకి గల సంబంధం ఏమిటి? అతని గురించి తెలుసుకునే లోపలే క్షణంలో మరుగైపోయి నా మనసులో పెద్ద తుఫాను సృష్టించాడు.

వుత్తరాలు కొనకుండానే రోడ్డున పడి నడవటం మొదలుపెట్టాను. ఎందుకో ఇంటికి వెళ్ళబుద్ధికాలేదు. దగ్గరిలో వున్న పార్కుకి వెళ్ళి ఒక మూల కూర్చున్నాను.

సునందకి నాకూ పెళ్ళిజరిగి ఆరునెలలు అయింది. మూడునెలల కిందట ఆమె కాపురానికి వచ్చింది. పెళ్ళికి ముందు ఆమె గతచరిత్ర ఏమిటో నాకు తెలియదు. అసలు "గతం" అంటూ ఏదైనా వుందో లేదోకూడా తెలియదు.

వాళ్ళవాళ్ళు ఎవరో వచ్చి పిల్లనిస్తామని మా నాన్నగారిని అడిగారు. ఆ తరువాత పెళ్ళిచూపులకి వెళ్ళి ఆమె నచ్చటం, పెళ్ళి చేసుకోవటం చకచకా జరిగిపోయాయి.

మూడు నెలలనుంచీ ఆమెతో కలిసి జీవిస్తున్నా, ఆమె నాకు ఇంకా పూర్తిగా పరిచయం కాలేదు. మా ఇరువురి మధ్య "కొత్త" ఇంకా వదలిపోలేదు.

ఈ హైదరాబాదులో తనకి తెలిసిన ఒక వ్యక్తి వున్నట్లు ఆమె నాకెన్నడూ చెప్పలేదు.

అతనెవరై వుండవచ్చు?

ఆమె బి.యే. చదివింది. అతను ఆమె కలిసి చదువుకున్నారా? ఆమె అతన్ని గతంలో ప్రేమించిందా? అతను ఆ కవరులో ఏమి వ్రాసి వుండవచ్చు? ప్రేమలేఖా?

మెదడు మొద్దుబారి పోయింది. బుర్ర వేడెక్కిపోయింది.

అసలు ఆ వుత్తరంలో ఏం వ్రాసి వుందో తెలిసేవరకూ ఏమీ అంతుపట్టేలా లేదు.

రేపు మధ్యాహ్నం పోస్టులో లెటరు ఇంటికి వస్తుంది. రేపు సెలవుపెట్టి సునందకంటె ముందుగా ఆ లెటరు అందుకోవాలి.

ఈ నిర్ణయం తీసుకున్న తరువాత మనసు కాస్త కుదుటపడింది.

అలస్యంగా ఇల్లు చేరుకున్నాను.

"ఇంత ఆలస్యం అయిందేం" అంది సునంద.

"ఆఫీసులో పని ఎక్కువగా వుండి ఇప్పటి దాకా వుండిపోయాను."

"త్వరగా స్నానంచేసి రండి. భోజనం చేద్దురుగానీ" అంది సునంద.

భోజనంచేస్తూ ఆమెను గమనిస్తున్నాను. కానీ ఆమెలో నాకు కొత్తభావాలు ఏమీ కనపడ లేదు.

రాత్రి పది దాటింది.

ఆమె నిద్రలోకి జారుకుంది. నేను ఇంకా ఆ వ్యక్తి గురించే ఆలోచిస్తున్నాను. ఎంత ప్రయత్నించినా నిద్ర రావటంలేదు.

"అతను సునందకి ఇంతకుముందుకూడా వుత్తరాలు వ్రాసివుంటాడు. ఆమె వాటిని దాచివుంటుంది" అనిపించింది.

సునంద నిద్రపోతూనే వుంది.

నిశ్శబ్దంగాలేచి ఆమె ట్రంకుపెట్టె తెరిచాను. ఎన్నో చీరెలు, ఎన్నో జాకెట్లు, ఎన్నో లంగాలు. అన్నిటినీ మడతలు విప్పిచూసాను. ఆఖరుకు ట్రంకు అడుగున వేసిన న్యూస్ పేపర్ కిందకూడా వెతికాను. నేను వూహించిన వస్తువు కనపడలేదు.

బట్టలు తిరిగి సర్దుతూవుండగా, సునందకి మెలకువ వచ్చినట్లుంది.

"ఏమిటండీ వెతుకుతున్నారు" అంది.

కన్నంలో పట్టుబడిన దొంగలా అయి పోయింది నా పరిస్థితి.

"ఆఫీసు కాగితం ఒకటి కనపడటంలేదు. నీ పెట్టెలోకి వచ్చిందేమోనని వెతుకుతున్నాను" నోటికి వచ్చిన అబద్ధం ఏదో చెప్పాను.

నా మాటలు నమ్మినట్టులేదు. అయినా ఏమనుకుందో ఏమో, మవునంగా మళ్ళీ నిద్ర పోయింది.

మరునాడు ఆఫీసుకు సెలవుపెట్టి రోజు అంతా పోస్ట్‌మాన్ కొరకు ఎదురుచూస్తూ కూర్చున్నాను. పోస్ట్‌మాన్ అందరికీ లెటర్లు పంచిపెట్టి వెళ్ళాడు. కానీ మాకు ఆ యువకుడు వ్రాసిన లెటరు రాలేదు.

అసలు ఆ లెటరుమీద సునంద పేరు వుందా? లేక నేను వూరికే భ్రమపడి వుండవచ్చా అన్న సందేహం కలిగింది. కానీ సందేహానికి తావులేదు. ఆమె పేరుతోపాటు మా యింటి అడ్రసు కూడా స్పష్టంగా చదివాను.

ఇవాళ కాకపోతే రేపు అయినా ఆ లెటరు వస్తుంది. ఆ లెటరు కోసమని రెండవరోజు కూడా సెలవుపెట్టాను.

"ఇవాళ కూడా ఆఫీసుకు వెళ్ళలేదు. వంట్లో బాగుండలేదా?" అంటూ సునంద నా నుదుటిమీద చెయ్యివేసింది జ్వరం చూస్తు న్నట్టుగా.

ఆమె చేతిస్పర్శలో గల ప్రేమకి, ఆమె నాపై చూపుతున్న అభిమానానికి క్షణకాలం కరిగిపోయాను. ఆమెను అనుమానిస్తున్నందుకు సిగ్గుపడ్డాను. కానీ ఆ లెటరులో ఏముందో చూడాలనే కోరిక చంపుకోలేకపోతున్నాను.

"వంట్లో కులాసగానే వుంది. కానీ ఆఫీసు పనిలో చికాకుగా వుంటూంది. అందుకే సెలవు పెట్టాను" అన్నాను.

"భోజనంచేసి హాయిగా నిద్రపొండి. విసుగు తగ్గిపోతుంది" అంది ఆమె.

నేను సెలవుపెట్టిన కారణం ఆమె గ్రహించి వుండవచ్చా? నేను నిద్రపోయే సమయంలో ఆ లెటరు వస్తే నాకు అందకుండా చేయాలని ఆమె పథకం చేస్తూందేమో. ఈ రోజు లెటరు వస్తుందని ఆమె వూహిస్తూ వుండాలి.

ఇలా కాదని చెప్పి తిన్నగా పోస్టాఫీసుకు బయలుదేరాడు.

మా బజారుకు వచ్చే పోస్టుమాన్ ఎవరో తెలుసుకుని, అతన్ని మంచిచేసుకుని, అడ్రసు చెప్పి మాకు లెటర్లు వుంటే యిచ్చెయ్యమని కోరాను.

అతను తనవద్దగల సంచిలోంచి యింత కట్ట బయటకు తీసి వరుసగా వెతకటం మొదలు పెట్టాడు.

నేను సస్పెన్సు భరించలేకపోతున్నాను.

ఇంతలో అతను ఒక కవరుతీసి అందించాడు.

అది సరిగ్గా నిన్న ఆ యువకుడి చేతిలో చూసిన కవరే. ఒకవైపు నుంచి జాగ్రత్తగా చింపి లోపలి కాగితం బయటకు తీసాను.

అందులో ఇలా వుంది.

డియర్ సునందా!

నిన్ను ఎప్పుడు చూస్తానా అని అనుక్షణం ఆరాటపడుతున్నాను. కానీ పని తొందరవల్ల వీలుపడటంలేదు. వీలు చూసుకుని వస్తాను. అన్ని విషయాలు అప్పుడే చెప్పుకుందాము.


ఇట్లు
నీ శ్రీపతి

నాకు అంతా అర్థం అయింది. అమాయకంగా కనపడే సునందలో ఇంత జాణతనం వుందని వూహించలేకపోయాను. అందుకే కాబోలు ఆడదాన్ని అసలు నమ్మకూడదంటారు. బహుశా ఈశ్రీపతితో లేచిపోవటానికి ఈ పథకం వేస్తూందేమో. అతనిమీద అంత ప్రేమవుంటే మరి నన్నెందుకు పెళ్ళి చేసుకుందో?

సునంద మీద నాకు అంతులేని అసహ్యం కలుగుతూంది. ఆమెని నిలువునా హత్యచెయ్యాలనిపిస్తూంది. కానీ ఆమెను చంపినందువల్ల నేను కొత్తచిక్కుల్లో ఇరుక్కోవటం తప్పించి నాకు ఒరిగేదేమీలేదు.

ఎలాగైనా ఆమెను వదిలించుకోవటం మంచిది. ఇలాంటిది అని తెలిసింతరువాత కూడా ఆమెతో ఎలా సంసారం సాగించటం? ఏది ఏమైనా బంగారంలాంటి నా జీవితం నాశనం అయిపోయింది. వివాహం అంటే ఇద్దరు కలిసి నిర్మించుకునే "స్వర్గసీమ" అనుకున్నాను కానీ ఇలా "నరకయాత్ర" అవుతుందని వూహించలేకపోయాను. ఇదంతా నా దురదృష్టం. కానీ కొంతలో కొంత మేలు అన్నట్టుగా పిల్లలు పుట్టకముందే అసలు రంకు బయటపడిపోయింది.

తక్షణం ఆమెని పుట్టింటికి పంపించి వెయ్యాలి. తరువాత లాయరును కన్సల్టుచేసి విడాకులు కోసం కోర్టులో కేసు ఫైలుచెయ్యాలి



అనుకున్నాను.

అనుకున్నదే తడవుగా తిన్నగా బస్‌డిపోకి వెళ్ళి వాళ్ళవూరికి వెళ్ళే బస్సులో ఒక సీటు రిజర్వ్ చేయించాను.

ఇవాల్టి బస్సులో సీట్లులేవు. అందువల్ల రేపటి వుదయం బస్సులో టికెట్టు తీసుకున్నాను.

ఆమెను పుట్టింటికి పంపుతున్నట్టుగా ఇవాళే చెప్పకూడదు. చెబితే ఆమె ఏవో కథలు అల్లి నా మనసు కరిగిపోయేలా చేయవచ్చు. రేపు వుదయం ప్రయాణం ఒకగంటలో వుందనగా, ఆమెకు చెప్పి ఆలోచించుకోవటానికి కూడా టైము యివ్వకుండా ఆమెను పంపెయ్యాలి.

నేను తిరిగి తిరిగి ఇంటికి వచ్చేసరికి నా భార్య ఎవరితోనో మాట్లాడుతూంది. నేను లోపలికి వెళ్ళేసరికి "నమస్కారం బావగారూ" అంటూ కుర్చీలోంచి లేచి వినయంగా నాకు నమస్కరించాడు అతను.

అతను ఎవరో కాదు. నిన్న నేను జి.పి.ఓ.లో చూసిన యువకుడే. అంటె శ్రీపతి అన్నమాట. నాకు కోపంలో వళ్ళు తెలియటంలేదు. ఇంకా కొంచెం ఆగితే నేను ఏంచేసివుండేవాడినో నాకే తెలియదు. కానీ ఇంతలో నా భార్య "వీడు శ్రీపతి. మా పెద్దనాన్నగారి అబ్బాయి. నాకంటె రెండేళ్ళ పెద్దవా... మన పెళ్ళికి రాలేదు. మీరు చూసివుండరు" అంది.

ఏదో చెప్పి దాటవెయ్యాలని సునంద ప్రయత్నిస్తూవుండాలి. ఇతను మా పెద్దమామగారి అబ్బాయి అయితే నాకు తెలియకపోవటం ఏమిటి? నా పెళ్ళికి రాకపోవటమేమిటో? ఆమె మాటలు నమ్మశక్యంగా లేవు.

"వీడు ఇన్నాళ్ళూ బెనారస్‌లో స్టేట్ బాంక్‌లో పనిచేశాడు. సెలవు దొరకక అప్పుడు మన పెళ్ళికి రాలేకపోయాడు. ఇప్పుడు వీడికి హైదరాబాదు ట్రాన్స్‌ఫరు అయిందట. వీడికి నేనంటే ఎంతో ప్రేమ. చూడండి నా కోసం ఎన్ని వస్తువులు తెచ్చిపెట్టాడో. నాకు అన్నయ్యలున్నారు కానీ వీడికి చెల్లెళ్ళు లేరు. అందుకే వీడికి నేనంటే చిన్నప్పటినుంచీ ఎంతో ప్రేమ" అంది సునంద.

"బావగారూ! మీరు నాకు చాలా నచ్చారు. మా చెల్లెలు చాలా అదృష్టవంతురాలు. మీలాంటి వున్నత విద్యావంతుడు, ఎంతో సంస్కారంగల వ్యక్తి ఆమెకు లభించటం మా అందరి అదృష్టం. మీరు మా సునందని ఎంతో మంచిగా చూసుకుంటారుట. ఆ విషయమే చెబుతూంది. మా సునందికి ఎలాంటి భర్త వస్తాడో అని అందరికంటె నేను దిగులు పడుతూవుండే వాడిని. మిమ్ములను ఇదే చూడటం అయినా ఎంతో ఆత్మీయులులాగా వున్నారు" అంటూ శ్రీపతి లేచి అక్షరాలా నన్ను కౌగలించుకుని నన్ను వున్నతుడిగా చిత్రిస్తూ తన ఆనందం వ్యక్తపరిచాడు.

నెమ్మదిగా నా ఆవేశం తగ్గిపోయింది.

నా తొందరపాటుకు నేను ఎంతో సిగ్గుపడ్డాను. నా భార్యపై నిష్కారణంగా అనుమానం పెంచుకున్నందుకు నాకు ఎంతో మానసిక గ్లాని కలిగింది.

శ్రీపతి సునందకి కజిన్‌బ్రదర్ అన్న విషయం రూఢీ అయింది. ఇప్పుడు అతని ముఖంలో మామగారి పోలికలు స్పష్టంగా అగుపడుతున్నాయి.

"అన్నట్లు సునందా! నిన్న నీకు లెటర్ వ్రాసాను. అందిందా? సిటీకి వచ్చి రెండు రోజులు అయినా ఆఫీజుచార్జి తీసుకోవటంలో తీరుబడి కాలేదు. ఇలా కాదని ఓ లెటరు రాసి పడేసాలే" అన్నాడు శ్రీపతి.

"లెటరా! నాకు ఏదీ రాలేదే" అంది సునంద ఆశ్చర్యంగా.

"లెటరు వచ్చింది. ఇందాక బజారులో పోస్టుమాన్ కనబడి ఈ లెటరు ఇచ్చాడు" అంటూ జేబులోంచి కవరు బయటకు తీసాను. కవరుతోపాటు బస్సుటికెట్టు వచ్చి కిందపడింది.

"ఈ టికెట్టు ఏమిటి? ఎవరికోసం?" అంటూ సునంద ఆ టికెట్టును తీసుకుని ఆశ్చర్యపోసాగింది.

"మా ఆఫీసులో ఒకతను తెచ్చిపెట్టమంటే ఇందాక అటువెళ్ళి తీసుకువచ్చాను. ఇలా యియ్యి" అంటూ దాన్ని ఆమెనుంచి తీసుకుని దాచేశాను.

అయితే యిది జరిగినప్పటి నుంచీ నా భార్య ముందు గిల్టీగానే ఫీలు అవుతున్నాను. □